గ్రామీణ రహదారులు గుల్లగుల్ల

తోటపల్లిగూడూరు: మండలంలోని తీర ప్రాంతాలైన వెంకన్నపాళెం, వరకవిపూడి, అనంతపురం, చింతోపు, పేడూరు, సీఎస్‌పురం, మండపం గ్రామాల్లోని పంచాయతీరాజ్‌శాఖ రహదారులు అస్తవ్యస్తంగా మారిపోయాయి. దుస్థితిలో ఉన్న రహదారులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రూపురేఖలను కోల్పోయాయి. ముఖ్యంగా వరకవిపూడి నుంచి అనంతపురం వరకు ఉన్న తారు రోడ్డు గుల్లగుల్లగా తయారైంది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు చేరి ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేటు వాహనాలు, ఆటోలు ఈ మార్గాల్లో ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది. సీఎస్‌పురం నుంచి గొల్లపాళెం వెళ్లే రహదారి గుల్లగుల్లగా మారడంతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే పేడూరు నుంచి చింతోపునకు వెళ్లే బీటీరోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే చిన్నచెరుకూరు- పాపిరెడ్డిపాళెం లింక్ రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులకు ఇక్కట్లను కలిగిస్తోంది. ఓ మోస్తరు వర్షాలకే గ్రామీణ రోడ్ల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే భవిష్యత్తులో రానున్న భారీ వర్షాలకు మరింత దుర్భర స్థితికి చేరక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వరకవిపూడి- అనంతపురం రహదారిలో భారీ గుంతల్లో చేరిన వర్షపునీరు


అస్తవ్యస్తంగా మారిన సీఎస్‌పురం- గొల్లపాళెం రహదారి


రూపురేఖలు కోల్పోతున్న పేడూరు- చింతోపు లింక్ రోడ్డు

బాణసంచా దుకాణాలపై తమ్ముళ్ల దందా

- రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు
- ఇలా అయితే తమకు లాభాలు ఎలా అంటూ దుకాణదారుల ఆవేదన

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ, రూరల్ ప్రాంతాలకు సంబంధించి బుచ్చి పట్టణంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే వీటి ఏర్పాటుకు సంబంధించి టీడీపీ నాయకులు సిండికేటుగా మారారు. పట్టణంలో గత సంవత్సరం 20 దుకాణాలు ఉండగా, ప్రస్తుతం మరో ఐదు దుకాణాలు కలిపి మొత్తం 25 ఏర్పాటు చేశారు. అయితే దుకాణాలు ఏర్పాటు చేసే నెపంతో టీడీపీ నేతలు దుకాణదారుల నుంచి రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారమంతా మున్సిపాలిటీలోని ఓ కౌన్సిలర్ ఆధ్వర్యంలో జరుగుతోంది. దుకాణదారుల నుంచి డబ్బులు వసూలు చేయడం, టపాకాయలు కూడా తమ దగ్గరే కొనాలని హుకుం జారీ చేస్తున్నారు. దీని వల్ల దుకాణదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధిక మొత్తంలో నగదు కట్టి దుకాణం తీసుకుంటే తమకు లాభాలు వచ్చే అవకాశం ఏ మాత్రం లేదని వారు వాపోతున్నారు. టీడీపీ నాయకులు సిండికేటుగా ఏర్పడి నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పట్టణంలో తూతూమంత్రంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

వసూళ్లు సరే.. సౌకర్యాలేవీ?

ముక్కుపిండి అధిక మొత్తంలో టీడీపీ నాయకులు నగదు వసూలు చేశారని, అయితే దుకాణాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పూర్తిగా విఫలమయ్యారని వారు తెలిపారు. భద్రతకు సంబంధించిన విషయాలు గాలికొదిలేశారు. దుకాణాల ముందు శుభ్రం చేయడం, టార్పాలిన్ కప్పడం లాంటి కనీస సదుపాయాలు లేకుండా చేశారు.

కొనుగోలుదారులపై పెనుభారం

టపాకాయలు కొనేందుకు పట్టణంతో పాటు, గ్రామీణ ప్రాంతాలు, ఇతర మండలాల నుంచి అధిక సంఖ్యలో మధ్య తరగతి, పేద కుటుంబానికి చెందినవారు వస్తుంటారు. టీడీపీ నాయకులు సిండికేటుగా ఏర్పడి అధిక మొత్తంలో దుకాణదారుల నుంచి వసూలు చేయడం, టపాకాయలు కూడా తమవద్దే కొనాలనే నిబంధన పెట్టడంతో.. దుకాణదారులు 30 నుంచి 40 శాతం అధికంగా విక్రయించే పరిస్థితి ఏర్పడింది. దీంతో దీపావళి పండగ జరుపుకోవడం పేదలకు కష్టంగా మారింది.

క్లుప్తంగా

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకుడు శ్రీనివాసులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, నవావరణ పూజ, దుర్గా హోమం పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పోలేరమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలకు పొట్టి నాగేంద్ర- అనూరాధ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయం వద్ద మహిళల కోలాటం, కందల సుస్మిత కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

రావి ఆకుపై దీపావళి



పొదలకూరు: మహ్మదాపురం గ్రామానికి చెందిన పచ్చా పెంచలయ్య రావి ఆకుపై దీపావళి వేడుకను ఆవిష్కరించారు. ఈ మేరకు ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

తిక్కవరప్పాడులో మాతమ్మ గ్రామోత్సవం


పూలాలంకరణతో మాతమ్మ గ్రామోత్సవం

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో మాతమ్మ అమ్మవారి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా రాత్రి అమ్మవారి విగ్రహాన్ని పూలు, విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించి ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం మాతమ్మ ఆలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

కల్యాణ మండపంలో బాణసంచా దుకాణాలు

పొదలకూరు: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా దుకాణాలను పట్టణంలోని హంసరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేశారు. దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు అధికారులు కమిటీగా ఏర్పడి తాత్కాలిక అనుమతినిచ్చారు. బాణసంచా ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసి అమ్ముకునేందుకు మాత్రమే అనుమతి ఇచ్చారు.

బయట అమ్మితే కేసులు

బాణసంచా వ్యాపారాన్ని అనుమతి పొందిన వారు కల్యాణ మండపంలోనే అమ్మాలని మండల కమిటీ అధికారులు వెల్లడించారు. బయటి ప్రాంతాలు, గ్రామాల్లో బాణసంచా అమ్మకాలు సాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


బాణసంచా దుకాణాలు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- బాణసంచా దుకాణాలను పరిశీలించిన సీఐ

మనుబోలు: దీపావళి సందర్భంగా అనుమతులు తీసుకుని టపాసులు విక్రయించే దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం మనుబోలు మండల కేంద్రంలోని టపాసుల దుకాణాలను పరిశీలించి విక్రయదారులతో మాట్లాడారు. బాణసంచా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు, పొడి ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అంగళ్ల మధ్య కనీస దూరం పాటించాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112కు కాల్ చేయాలని సూచించారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న పొదలకూరు సీఐ

ఉచిత మెగా వైద్య శిబిరం

పొదలకూరు: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నవజ్యోతి యూత్ ఆర్గనైజేషన్, ఆదిలీలా ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నారాయణ వైద్యశాలకు చెందిన డాక్టర్లు రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. శిబిరానికి హాజరైన వారికి రక్త పరీక్షలను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యశిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పూరిల్లు దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం

కోవూరు: మండల పరిధిలోని చెరువుకట్ట ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక గిరిజన మహిళ కొప్పాల శేషమ్మకు చెందిన పూరింటి పైనుంచి 11 కేవీ విద్యుత్ తీగలు వెళ్తుండగా, ఆదివారం ఉదయం గాలివానలతో తీగలు ఒకదానికొకటి తగలడంతో నిప్పురవ్వలు పూరింటిపై పడి మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో వ్యాపించి ఇంటి పైకప్పు, గోడలు, గృహోపకరణాలు, అన్నీ బూడిదయ్యాయి. స్థానికులు నీటి బిందెలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంటనే గ్రామస్తులు అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించగా, హుటాహుటిన వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పూరిల్లు పూర్తిగా బూడిదైపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

హైటెన్షన్ వైర్లతో తరచూ ప్రమాదాలు

ప్రమాదం గురించి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు కవరగిరి ప్రసాద్‌తో పాటు మండలాధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇంటి పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ తీగల వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.


దగ్ధమైన పూరిల్లు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ఆంజనేయవర్మ కోరారు. దర్గామిట్టలోని ఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ.. వార్డు సచివాలయ నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉద్యోగోన్నతులు, గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒక డీఏనే ప్రస్తుతానికి విడుదల చేయనున్నారని, మిగిలిన వాటిని త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఏపీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్కాకుల పెంచలయ్య, రాజేంద్ర, కిరణ్‌కుమార్, సతీష్, కృష్ణంరాజు, కృష్ణకుమార్, నగర శాఖ సభ్యులు మధు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేతలు

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి


ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల జీవితాల్లోని కష్టాల చీకట్లు తొలగి సంతోషాల వెలుగులు నిండాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు కోవూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన ఆదివారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు, దీపాల వెలుగులతో ప్రతి ఇంటా సిరుల పంట కురిపించాలని కోరుతున్నట్లు తెలియజేశారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గా వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వరుస సెలవుల నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కసుమూరుకు వచ్చి మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకున్నారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ డివైడర్‌ను ఢీకొని ఒకరు గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన రవికిరణ్ పని నిమిత్తం మోటార్ బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపంలో ముందు వెళ్తున్న ఆటో అకస్మాత్తుగా ఆగిపోవడంతో, బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికిరణ్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. దగదర్తి మండలానికి చెందిన పావనికి బెంగళూరుకు చెందిన మల్లితో ఇటీవల వివాహమైంది. ఈ క్రమంలో దసరా నిమిత్తం వీరు దగదర్తి వచ్చారు. బెంగళూరుకు తిరిగెళ్లేందుకు గానూ నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌కు ఈ నెల ఒకటిన వచ్చారు. వాష్‌రూమ్‌కు వెళ్లిన పావని అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

పూజా సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ఆలయాల నిర్వాహకులకు ధూప, దీప నైవేద్య సామగ్రిని పొదలకూరు రోడ్డులోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి కన్వీనర్ ధన్వి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. విజయవాడలోని గన్నవరం భువనేశ్వరి పీఠ నిర్వాహకుడు కమలానందభారతి ఆశీస్సులతో కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. సభ్యులు నెల్లూరు వెంకటరత్నం, మేకల నరసింహారావు, దరిశిగుంట వెంకటేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యవిద్యను దూరం చేసేందుకు కుట్ర


కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళలు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

కోవూరు: పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ రాష్ట్ర సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని వారు ఆదివారం కోవూరులో చేపట్టారు. తొలుత మహిళలతో కలిసి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జగనన్న పాలనలో పేదల వైద్య విద్య, ఆరోగ్యం కోసం 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఆయా కళాశాలలను వారి అనుచరులకు అప్పగించేందుకు ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. దీని వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు వైద్య విద్య అందనంత దూరం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ప్రాణాలను కాపాడాలన్న భావనతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలను తీసుకొచ్చారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని చిల్లర డబ్బులకు లీజుకు ఇచ్చి దోచుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. పేదల వైద్య హక్కును రక్షించడానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కిశోర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకట్రావు, వేమారెడ్డి శివకుమార్ రెడ్డి, వాకా సుబ్బరామిరెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమరిక రోడ్లు జలమయం

ఇందుకూరుపేట: చిన్నపాటి వర్షానికే మండలంలోని కొమరిక రహదారులు జలమయమయ్యాయి. ఇక్కడ సిమెంట్ రోడ్లు వేశారే కానీ డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతున్నాయి. ప్రధానంగా లోతట్టు రహదారులు, వీధుల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పిల్లలు సైతం పాఠశాలలకు బురద నీటిలో వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందుచూపు లేకుండా ఇలా రోడ్లను వేయడంతోనే ఇబ్బందులు వస్తోందని స్థానికులు వెల్లడిస్తున్నారు. రోజుల తరబడి ఇలానే వర్షపు నీరు నిల్వ ఉంటే వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలువకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


తూర్పువీధిలో నిలిచిన వర్షపు నీరు

దెబ్బతింటున్న రక్షణ గోడలు


ఏటి కాలువపై దెబ్బతిన్న వంతెన రక్షణ గోడలు

రాపూరు- పొదలకూరు మార్గం దేగపూడి వద్ద కండలేరు ఏటికాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు దెబ్బతింటున్నాయి. ఈ వంతెనను దశాబ్దాల నాడు నిర్మించినా ఇప్పటికీ పటిష్టంగానే ఉంది. అయితే వంతెనపై నిత్యం వివిధ రకాల వాహనాలు పెద్ద సంఖ్యలో నడుస్తుంటాయి. ఈ నేపథ్యంలో తరచూ ప్రమాదాలు సంభవించి రక్షణ గోడలను ఢీకొనడంతో దెబ్బతింటున్నాయి. 2015 పెను తుఫాను సందర్భంగా గతంలో ఎన్నడూ జరగని విధంగా వంతెనపై ఏటికాలువ ప్రవహించింది. అయితే వంతెన చెక్కుచెదరలేదంటే అప్పట్లో ఎంత పటిష్టంగా నిర్మాణాలు జరిగేవో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో రక్షణ గోడలకు రిపేర్లు చేపట్టాల్సిందిగా స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– పొదలకూరు

బేకరీ ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో బేకరీని ధ్వంసం చేసిన ఘటనపై కేసును దర్గామిట్ట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. దర్గామిట్టలో జయప్రకాష్‌కు చెందిన దుకాణాన్ని హరనాథ్‌రెడ్డి బాడుగకు తీసుకొని జస్ట్ బేక్ పేరుతో బేకరీని నిర్వహిస్తున్నారు. దుకాణ బాడుగ పెంపు విషయమై వీరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉంది. ఈ తరుణంలో బేకరీని జేసీబీతో శుక్రవారం రాత్రి కొందరు ధ్వంసం చేశారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. విచారణ జరుపుతున్నారు.